ప్రజాశక్తి

మంగళవారం 8 జూలై, 2025 5

శ్రీకాకుళం

10న టెలిగ్రాఫ్ మహాజన సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ది టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభను ఈనెల పదో తేదీన నిర్వహిస్తున్నట్లు సబ్ డివిజన్ కోపరేటివ్ అధికారి ఎం.చంటిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారులు తనకు లిక్విడేషన్ అధికారిగా నియమించినందున, సంఘం ఆస్తి, అప్పులకు సంబంధించి నోటీసులు జారీ చేసి క్లయిమ్‌లను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సంఘం లిక్విడిటీ పూర్తి చేసేందుకు మహాజన సభకు సభ్యులు హాజరు కావాలని కోరారు.

బంగారు కుటుంబాల భవిష్యత్తేమిటో?

- పేదలను ఆదుకునేందుకు ముందుకు రాని మార్గదర్శులు
- పి-4 సర్వేలో జిల్లాలో 75,566 కుటుంబాల గుర్తింపు
- 97 కుటుంబాలనే దత్తత తీసుకున్న వైనం
- టెక్కలి, శ్రీకాకుళంలో ఒక్కరూ రాలేదు

పేదలను ఆదుకునేందుకే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) విధానం అంటూ ప్రభుత్వం ప్రచారం చేసినంతగా దాని అమల్లో కనిపించడం లేదు. సమాజంలోని అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను మొదటి 20 శాతం సంపన్న కుటుంబాలు సాయమందించడమే దీని ప్రధాన లక్ష్యమంటూ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. బంగారు కుటుంబాలు-మార్గదర్శులు అనే నినాదంతో ప్రారంభించిన కార్యక్రమానికి సంపన్న కుటుంబాల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. జిల్లాలో 75,566 బంగారు కుటుంబాలను గుర్తించగా, వాటిలో 97 కుటుంబాలకు సాయం అందించేందుకు 26 మంది మార్గదర్శులు మాత్రమే ముందుకు వచ్చారు. మార్గదర్శులు ముందుకు రాకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. దీంతో సంపన్న కుటుంబాలతో తమకు ప్రభుత్వం ఏదో మేలు చేయిస్తుందని భావించిన నిరుపేద కుటుంబాలకు నిరాశే మిగులుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పి-4 విధానాన్ని తెర పైకి తెచ్చింది. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం నిరుపేద కుటుంబాలను మొదటి 20 శాతం సంపన్న కుటుంబాలు ఆదుకునే లక్ష్యంతో తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ఈ ఏడాది మార్చి ఎనిమిది నుంచి 18వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వే చేపట్టారు. ప్రభుత్వ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించారు. ఆ విధంగా జిల్లాలో 75, 566 కుటుంబాలు ఉన్నట్లు తేల్చారు. అందులో 2,11,586 సభ్యులు ఉన్నట్లు గుర్తించారు. నియోజకవర్గాల వారీగా కుటుంబాలను గుర్తించి, వారిని ఆదుకునేందుకు మార్గదర్శులను అన్వేషించడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు మొత్తం 97 బంగారు కుటుంబాలకు సాయపడేందుకు 26 మంది మార్గదర్శులు మాత్రమే వచ్చారు.

ప్రజాప్రతినిధులకు బాధ్యత లేదా?

బంగారు కుటుంబాలను గుర్తించిన తర్వాత వారిని ఆదుకునే మార్గదర్శుల కోసం అధికారులే అన్వేషణ చేస్తున్నారు. దీంతో మార్గదర్శుల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో సహా ఎమ్మెల్యేలెవరూ ఇందులో భాగస్వామ్యం కావడం లేదు. దీంతో మార్గదర్శులే కరువయ్యారు. ప్రస్తుతం ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులు కూడా సమాజంలో మొదటి 20 శాతంగా ఉన్న అత్యంత సంపన్నులేమీ కాదు. మానవతా దృక్పథం, పేదలను ఆదుకోవాలన్న సంకల్పంతో వారు ముందుకు వచ్చారు. తరతరాలుగా అనుభవించినా తరగని సంపద, వందల కోట్ల టర్నోవర్‌తో పరిశ్రమలను నడిపిస్తున్న వ్యాపారులు, వందలాది ఎకరాల భూములు అనుభవిస్తున్న పెద్దలు, కోట్ల రూపాయలను ఆదాయ పన్నుగా చెల్లిస్తున్న సంపన్నులు ఇలా చెప్పుకుంటూ వెళ్తే ధనవంతుల జాబితా చాంతాడులా ఉంటుంది. ప్రజాప్రతినిధులు చెప్తే వీరిలో ఎవరూ కాదనరు. కానీ మంత్రి అచ్చెన్నాయుడుతో సహా ఎమ్మెల్యేలెవరూ చొరవ చూపకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం నీరుగారుతోంది.

ప్రజాప్రతినిధుల్లో రామ్మోహన్ నాయుడు ఒక్కరే మార్గదర్శి

ప్రజాప్రతినిధుల్లో కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కాస్త నయమనిపించారు. పది మంది నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహా ఇతర ఎమ్మెల్యేలు ఎవరూ కుటుంబాలకు సాయం చేసేందుకు ముందుకు రాకపోవడంపై ప్రజల్లో చర్చ నడుస్తోంది. ప్రజాప్రతినిధులు చొరవ చూపితే దాని ప్రభావం వేరుగా ఉంటుంది. తాము ఫలానా కుటుంబాలను ఆదుకుంటామని వారు ప్రకటిస్తే, ఇతర సంపన్న కుటుంబాలూ ముందుకొచ్చే అవకాశం ఉంది. తమకు సాయం అందించే చేతుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అంతా కోరుతున్నారు.

టెక్కలి, శ్రీకాకుళంలో ఒక్కరూ రాని వైనం

ప్రభుత్వం గుర్తించిన బంగారు కుటుంబాల్లో నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పాతపట్నంలో 11,572 బంగారు కుటుంబాలు ఉన్నాయి. వారిలో 55 కుటుంబాలను ఆదుకోవడానికి ఏడుగురు వచ్చారు. ఎచ్చెర్లలో 11,024 కుటుంబాలు ఉండగా, ఐదు కుటుంబాలకు సాయం చేసేందుకు ఇద్దరు మార్గదర్శులు మాత్రమే వచ్చారు. శ్రీకాకుళంలో 10,324 కుటుంబాలను గుర్తించగా, సాయం చేసేందుకు ఒక్క కుటుంబాన్నీ ఎవరూ దత్తత తీసుకోలేదు. ఇచ్ఛాపురంలో 9,659 బంగారు కుటుంబాలు గుర్తించగా, 28 కుటుంబాలను ఆదుకునేందుకు ఆరుగురు ముందుకు వచ్చారు. టెక్కలిలో 9,541 బంగారు కుటుంబాలు గుర్తించగా, ఒక్క కుటుంబానికీ సాయపడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఆమదాలవలసలో 9,023 కుటుంబాలను గుర్తించగా, రెండు కుటుంబాలను ఆదుకోవడానికి ఇద్దరు మార్గదర్శులు వచ్చారు. నరసన్నపేటలో 7,745 బంగారు కుటుంబాలను గుర్తించగా, నాలుగు కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు నలుగురు వచ్చారు. పలాసలో 6,678 కుటుంబాలను గుర్తించగా, వారిలో మూడు కుటుంబాలకు చేదోడుగా ఉండేందుకు ముగ్గురు మార్గదర్శులు వచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి

సమ్మెకు సంపూర్ణ మద్దతు : వామపక్షాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 9న చేపడుతున్న అఖిల భారత సమ్మెకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, టి.ప్రకాష్, తామాడ సన్యాసిరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ వెల్లడించారు. సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతి భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2019లో కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోనూ ఎనిమిది గంటల పని స్థానంలో పది గంటల పని దినంగా మార్పు చేసిందని తెలిపారు. రక్షణ సౌకర్యాలు కల్పించకుండా మహిళలతో రాత్రి షిఫ్టుల్లో పనిచేయించుకునేందుకు యాజమాన్యానికి స్వేచ్ఛ ఇస్తూ, శ్రామిక మహిళల హక్కులను కాలరాస్తూ చట్టంలో సవరణలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో తెచ్చిన సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపివేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, 108, 104, ఆరోగ్యమిత్ర తదితర చిరుద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పనిగంటలు ఉపసంహరించుకోవాలని, రక్షణ సౌకర్యాలు, నిబంధనలు అమలు చేయకుండా రాత్రిపూట మహిళలతో పనిచేయాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు నూతన కౌలు చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ రోజు కూలి రూ.600 చెల్లించాలని, పట్టణ ప్రాంతాల్లోనూ పథకం అమలు చేయాలని కోరారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు చెల్లించడంతో పాటు సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు బిగించరాదని, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ కార్మికులతో సహా అసంఘటితరంగ కార్మికులందరికీ సాంఘిక భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంతో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మికులందరికీ వేట నిషేధభృతి చెల్లించాలని కోరారు. 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై జూలై 9న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ ప్రాంతంలో ఆందోళనలకు పిలుపునిచ్చాయని, ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బొత్స సంతోష్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరబిందో కార్మికుల పోరాటంలో భాగంగా 2014లో నమోదైన కేసు విషయంలో శ్రీకాకుళంలోని న్యాయస్థానం ఎదుట ఆయన సోమవారం హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపు పెద్దగా లేకపోవడంతో, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైందని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో, ఒడిశాలోనూ ఎన్‌డిఎ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని, ఈ నేపథ్యంలో నేరడి బ్యారేజీ నిర్మాణంపై ఒడిశాతో ఉన్న సమస్యలను పరిష్కరించుకుని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఊరుకునేది లేదన్నారు. రాష్ట్రంలో ముందు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేశాకే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో, సాగునీరందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో రైతాంగం రాష్ట్ర ప్రభుత్వంపై గుర్రుగా ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదని, అమరావతి నిర్మాణానికి అప్పు ఇస్తున్నారు తప్ప రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టులు, ఎయిర్‌పోర్టుల కోసం బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

10న మెగా పేరెంట్, టీచర్ సమావేశం

- విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలి
- ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల పదో తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విద్యార్థులకు గతేడాది ఏం చేశాం, ఈ విద్యా సంవత్సరంలో ఏం చేయబోతున్నామనే అంశాలపై విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే ప్రణాళికపై చర్చిస్తారన్నారు. విద్యార్థులకు విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా సమావేశంలో తెలియజేయవచ్చన్నారు. సమస్యలపై దృష్టిసారించాలని టీచర్లకు తెలియజేయాలన్నారు.

గ్రీన్ పాస్‌పోర్టు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఏక్ పేర్ మాగీనామ్ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ నుంచి మొక్కలు సరఫరా చేస్తారని చెప్పారు. ప్రతి విద్యార్థి పాఠశాల గానీ కళాశాల ఆవరణలో గానీ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలన్నారు. మొక్క నాటడంతో పాటు ఆరు నెలల పాటు మొక్క సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. అదే రోజు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరెంట్స్, టీచర్స్, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అందరూ వస్తే ఒక పండగ వాతావరణంలో కలసి భోజనం చేద్దామన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఘనంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీకి అవార్డు

శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రక్తదానానికి ఎప్పుడైనా పిలుపునిస్తే అవకాశమున్న వారు రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసేందుకు రెడ్‌క్రాస్ సొసైటీకి గానీ రిమ్స్‌కు గానీ వెళ్లవచ్చన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని పరిశ్రమల్లో భద్రత తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పరిశ్రమల భద్రతపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపకశాఖ, విపత్తుల నిర్వహణశాఖ అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సోమవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు భద్రతపై పూర్తి శ్రద్ధ వహించాలని సూచించారు. రెండు వారాల్లోగా అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదకర పరిశ్రమలు తప్పనిసరిగా ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. పరిశ్రమల వద్ద ఎమర్జెన్సీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని స్పష్టం చేశారు. డ్రయ్యర్లకు డస్ట్ హజార్డ్ అనాలిసిస్ చేయాలని, థర్డ్ పార్టీ ఇన్‌స్పెక్షన్ చేయించుకోవాలని తెలిపారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో ఎమర్జెన్సీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మ్యూచువల్ ఎయిడ్ కార్యక్రమాలను బలోపేతం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి ఫార్మా ఇండస్ట్రీస్‌లో ఇటీవల సంభవించిన ఘోర ప్రమాదాన్ని గుర్తు చేశారు. అటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరని ఉద్ఘాటించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, అగ్నిమాపక అధికారి మోహనరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, పరిశ్రమల శాఖాధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఆంధ్రా ఆర్గానిక్స్, అరబిందో, శ్రేయస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఐటి ర్యాంకర్లకు కలెక్టర్ అభినందన

శ్రీకాకుళం సిటీ: ఉన్నత శిఖరాలను జిల్లా విద్యార్థులు అందుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఐఐటిలో జాతీయస్థాయిలో 21వ ర్యాంకు సాధించిన పల్లా భరత్ చంద్ర, 256వ ర్యాంకు సాధించిన బి.రోహిత్‌దత్‌లను జెడ్‌పి సమావేశ మందిరంలో కలెక్టర్ సోమవారం అభినందించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ముంబయి ఐఐటిలో సిఎస్‌సిలో సీటు సంపాదించినట్లు పల్లా భరత్‌చంద్ర కలెక్టర్‌కు వివరించారు. తెలంగాణ ఎంసెట్‌లో స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భరత్‌చంద్ర కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కలెక్టర్

9న సిజిఆర్ఎఫ్ సమావేశం

విశాఖపట్నం: ఎపి ఇపిడిసిఎల్ శ్రీకాకుళం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల తొమ్మిదో తేదీన పాలకొండ డివిజన్‌లోని వీరఘట్టం సెక్షన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే సమావేశంలో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ చేసి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు.

పలాస జీడిపప్పుకు జాతీయ అవార్డు

14న న్యూఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పలాస జీడిపప్పుకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. రైతుల అకుంఠిత దీక్ష, అధికార యంత్రాంగం కృషి, పటిష్టమైన ప్రణాళికల ఫలితంగా వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) కార్యక్రమంలో భాగంగా పలాస జీడిపప్పుకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ఈనెల 14న ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నారు. పలాస జీడిపప్పుకు అవార్డు వరించడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను అభినందించారు.

వంటను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మీ పిల్లలైతే ఇలాగే చేస్తారా..?

- గురుకుల పాఠశాల నిర్వహణపై జెసి ఆగ్రహం
- ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు
- వార్డెన్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని కొల్లివలసలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నిర్వహణ తీరుపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కుళ్లిన అరటిపళ్లతో పాటు కొద్దిమంది విద్యార్థులకి సరిపడా ఆహారం వండడం, మరుగుదొడ్లు దుర్గంధభరితంగా ఉండడంపై ప్రిన్సిపాల్, వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పాఠశాలలో మీ పిల్లలు చదివితే ఇలాగే చేస్తారా అని ప్రశ్నించారు. కొల్లివలస గురుకుల పాఠశాలను జెసి సోమవారం పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించగా కుళ్లిన అరటిపళ్లు, పాఠశాలలోని 450 మంది విద్యార్థులు ఉండగా కొద్దిమంది విద్యార్థులకు సరిపడా ఆహారం ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గంధభరితంగా మరుగుదొడ్లు ఉండడంపై మండిపడ్డారు. కనీసం సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారా, లేదా అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యంపై కనీసం శ్రద్ధ లేదా, అంత నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాల నిర్వహణ అధ్వానంగా ఉండడంపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సక్రమంగా విధులు నిర్వర్తించని మరో ఆరుగురు సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

బియ్యం గిడ్డంగుల తనిఖీ

మండలంలోని సింగన్నపాలెంలో గల బియ్యం గిడ్డంగులను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ హాస్టల్‌కు సరఫరా చేసే బియ్యంలో నాణ్యత కరువైందని వార్తలు రావడంపై జెసి స్పందించి పరిశీలించారు బియ్యాన్ని ఉడికించి నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ వై.వి పద్మావతి, సివిల్ సప్లై డిటిలు వెంకటేష్, మురళీకృష్ణ తదితరులున్నారు.

పాస్ పోర్ట్ పోయినది

నేను **Chinnadurai Murugan,** S/o **Murugan**, వయసు 51 సం॥, ప్లాట్ నంబరు 401, ఎ.హెచ్.ఆర్ నివాస్. **PN** కాలనీ, 2వ లైన్, శ్రీకాకుళం టౌన్&జిల్లా, ఆంధ్రప్రదేశ్ 532001.

నా యొక్క పాస్ పోర్ట్ నంబరు A9406698, 13-02-2001న జారీ అయింది. నేను పి.యన్ కాలనీ నుంచి శ్రీకాకుళం ఆర్.టి.సి కాంపెక్స్‌కి వెళ్తుండగా మార్గ మధ్యలో 13-06-2025న నా పాస్ పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల శ్రీకాకుళం 2టౌన్ పోలీస్ స్టేషన్‌లో గాని ఈక్రింది ఫోన్ నంబరుకు గాని తెలియజేయగలరు.

ఫోన్: **7995561287**

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT ICHAPURAM
O.S. No: 12 / 2025

Between:
Yellanki Prem Kumar ....Plaintiff
And:
Esuru Neeladri Reddy .....Defondant

SUIT SUMMONS U/O. V Rule 20 C.P.C

To,
Esuru Neeladri Reddy, S/o. late Jagannadham Reddy, Business, aged about 55 years, R/o INNISIPETA Village Tulasigam Madurs, Dharmapuram Post, Ichapuram Mandal, Srikkakulam District, A.P.

Whereas the above named plaintiff has instituted a Suit against you for the relief shown in the plaint. You are hereby summoned to appear in this Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person, able to answer all such questions on the **4th day of August 2025 at 10.30 A.M.** in the forenoon, to answer the claim, and as the day fixed for your appearance is appointed whose evidence and all the documents upon which you intend to rely in support of your defence.

Take notice that in default of your appearance on the day before mentioned. The suit will be heard and determined in your absence and set Exparty.

Date of Hearing: 04.08.2025
(By Court Order)

Place: Ichapuram
Date: 08-07-2025

S. L. NARAYANA
ADVOCATE,
ICHAPURAM.

మహారాజశ్రీ కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.పి. నెం. 22/2024

మధ్య:
మేడపాటి వెంకటరెడ్డి, తండ్రి: సూర్యచంద్రారెడ్డి, ఊబలంక గ్రామం, రావులపాలెం మండలం. -పిటీషనర్

Vs

మేడపాటి సరిత కుమారి, భర్త: వెంకట రెడ్డి, తండ్రి: నీలపు వైకుంఠం (లేటు), C/o. కొయ్యా పరిమళ, రెడ్డిక వీధి, శ్రీపురం గ్రామం, గారా మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్. -రెస్పాండెంట్

పై నెంబర్ పిటీషన్‌లో పిటీషనర్ మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలసినదిగా నోటీసులు పంపినప్పటికీ మీరు సదరు నోటీసులు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారని శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది. సదరు పై నెంబర్ పిటీషన్ వాయిదా తేది. **డి.వి. 22-07-2025వ సం॥ తేదీన అయి ఉన్నది. కావున సదరు తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవలసినదిగాను, లేని ఎడల సదరు తేదీన శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున పై పిటీషన్ తీర్మానము చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

యం.బ్రహ్మానందరెడ్డి
పిటీషనర్ తరపు న్యాయవాది
కొత్తపేట రావులపాలెం
తేది:07-7-25 సెల్: 9440962317

ఫిర్యాదుదారుల నుంచి సమస్యను తెలుసుకుంటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)లో స్వీకరించే ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపి, బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు విభాగంలో 72 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వృద్ధులు, వికలాంగుల అర్జీదారుల దగ్గరకు వెళ్లి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులకు సూచించారు.

పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

జగనన్న లేవుట్ పరిశీలన

టెక్కలి రూరల్ : మండలంలోని అంజినేయపురంలో ఉన్న జగనన్న లేవుట్‌ను ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సోమవారం పరిశీలించారు. లేవుట్‌లో మౌలిక వసతులు, రోడ్లు, తాగునీటి, కాలువల గురించి ఆరా తీవారు. 409 ప్లాట్ లను వేసి ఉన్నాయని, అందులో 372 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ చేశామని, 110 మందికి హౌసింగ్ బిల్లులు మంజూరు చేశామని రెవెన్యూ అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎం.జనార్ధనరావు, డిటి ఎస్.రవికుమార్, మండల సర్వేయర్ బాలరెడ్డి, పి.యుగంధర్, సచివాలయ సర్వేయర్ దయాశంకర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

నెల రోజుల్లో ఓవర్ బ్రిడ్జికి టెండర్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతంగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ భువనేశ్వర్‌లో చీఫ్ ఇంజినీర్ ఆఫీస్‌లో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.ఎచ్.విక్టర్ జోసెఫ్‌కి వినతిపత్రం అందించామని జెడ్‌ఆర్‌యుసిసి సభ్యులు శ్రీనివాస్ రాచిలో తెలిపారు. భువనేశ్వర్‌లో సోమవారం కలిసి ఇచ్ఛాపురంలో మంజూరైన రోడ్ ఓవర్ బ్రిడ్జి పనులు తక్షణమే పనులు ప్రారంభించాలని కోరామన్నారు. ఇటీవల గేట్ వద్ద ట్రాఫిక్ జామ్‌తో అంబులెన్ ఇరుకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు స్పందించి నెల రోజుల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సదానంద రౌలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

సన్నబియ్యం నాణ్యత పరిశీలన

నందిగాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి పంపిణీ చేసిన సన్నబియ్యం నాణ్యతను జిల్లా సివిల్ సప్లయి క్వాలిటీ అధికారి సంతోష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. మండలంలోని నర్సిపురం, నందిగాం, లఖిదాసుపురం జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించి సన్న బియ్యాన్ని పరిశీలించారు. సన్నబియ్యంలో పురుగులు, వస్తున్నాయని, బియ్యం అట్టలు కట్టి వస్తున్నాయనే ఫిర్యాదు మేరకు పరిశీలించారు. కొన్నిచోట్ల బియ్యం బస్తాల్లో లార్వా వంటి పురుగుల అవశేషాలను గుర్తించారు. కొన్ని బియ్యం బస్తాల్లో నల్లటి సుంకు పురుగులు రావడాన్ని గుర్తించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడి బియ్యం వినియోగంపై సూచనలు చేశారు. ఈయనతో పాటు స్థానిక ఎంఎల్ఎస్ గోదాం ఇన్‌ఛార్జి, సిఎస్‌డిటి అనిల్‌కుమార్ పాత్రో ఉన్నారు.

గిరిజనులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి

టెక్కలి : కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం గిరిజన రైతులకు వర్తింపజేయాలని గిరిజన సంఘ నాయకుడు జన్ని పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనులకు గత ప్రభుత్వ హయాంలో డిపట్టా, ఆర్ఎఫ్ పట్టాల మంజూరు చేసి భరోసా అందించేవారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆధార్ కార్డుని పరిశీలించి చెక్ చేస్తే పోర్టల్‌లో డేటా ఉండడం లేదన్నారు. దీనిపై పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని గిరిజనులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు. నరేంద్ర చక్రవర్తి, రాంజీ పాల్గొన్నారు.


మరమ్మతులకు గురైన అండర్ పాస్ బ్రిడ్జి

మరమ్మతులకు నిధుల మంజూరు

కవిటి: 34 ఏళ్ల నిరీక్షనకు తెర పడింది. గొర్లపాడు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద ప్రమాదకర గోతులతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం కనిపించింది. 1989లో నిర్మించిన తరువాత తాజాగా రూ.6 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా జెడ్ ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పనులు రెండు రోజుల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. అండర్ పాస్ మరమ్మతుల నిధులకు కృషిచేసిన కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, స్థానికనేత సదానందరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా బైక్ ర్యాలీ

శ్రీకాకుళం సిటీ : బైక్ ర్యాలీలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు

సోంపేట : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు జూలై 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు. జూలై 9న జరగనున్న సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం చిలకపాలెం నుంచి ఎచ్చెర్ల ఆంధ్ర బ్యాంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. 9న జరగనున్న సమ్మె కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక కావాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం, శాంపిస్టన్స్ ప్లాంట్-3, ఎపి బిసిఎల్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పుడు, చిక్కాల సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, అంబటి సత్య నారాయణ, డి.కుమార్, ఎన్.రమణ, యం.అశోక్, పి.సంతోష్, పి. శ్రీనివాస రావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.సునీల్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు పిలుపునిచ్చారు. జూలై 9 సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి సూర్యమహల్ మీదుగా ఏడురోడ్ల జంక్షన్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీ ముగింపు సమావేశం ఏడు రోడ్ల జంక్షన్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు శ్రీకాకుళం టౌన్ కన్వీనర్ ఆర్. ప్రకాశరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, జె.వి.వి నాయకులు కె.అప్పారావు, ఎఐటియుసి నాయకులు టి.తిరుపతిరావు, మెడికల్ రిప్స్, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకు, మున్సిపల్, పెన్షనర్స్, కళాసి, రిమ్స్, ఎఆర్ఎస్ తదితర సంఘాల నాయకులు డి.వాసుదేవరావు, ఎన్. మహేశ్వర రావు, ఎం.గోవర్ధనరావు, టి.ఆచారి, ఎం.శ్రీనివాసరావు, కె.గణపతి, డి.పార్వతీశం, బి.చిన్నారావు, పి.శ్రీనివాస్, వై.శ్రీనివాసరావు సిహెచ్. రాజేంద్రప్రసాద్, జి.సతీష్, ఎస్.బలరాం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : ఈ నెల 9 నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె విజయవంతంపై బైక్ ర్యాలీ నిర్వహించారు. కంచిలిలో ప్రారంభమైన బైక్ ర్యాలీ సోంపేట చేరుకుంది. ఈ ర్యాలీ నుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల పొట్టకొట్టి కార్పొరేట్లకు ఊడిగం చేసే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.గోపీనాథ్, సిఐటియు కంచిలి మండల నాయకులు పి.కృష్ణ, సోంపేట మండల నాయకులు పి.చిరంజీవి, జె.సింహాచలం, రైస్‌మిల్ వర్కర్స్ నాయకులు రఘు, కామయ్య, వాసులు, దుర్యోధన, నారాయణస్వామి, యామయ్య, పాపారావు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మద్దతు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9న జరగనున్న అఖిల భారత సమ్మెలో పెన్షనర్లు పాల్గొంటారని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తి తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో సోమవారం విశ్రాంత ఉద్యోగ భవనంలో వారు మాట్లాడుతూ వేతన సవరణ సమయంలో పెన్షనర్లకు కూడా పెరుగుదల (అప్డేషన్) చేసే నియమాన్ని ప్రశ్నార్థకం చేసే కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వును ఉపసంహరించాలని కోరారు. న్యూ పెన్షన్ స్కీమ్ బదులుగా తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ విధానం ఆమోదకరం కాదని, అందరికీ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలన్నది ఉద్యోగ పెన్షనర్ల డిమాండ్ అన్నారు. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ పెన్షనర్లకు కనీసం తొమ్మిది వేలు కరువు భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు పూర్తిస్థాయి వైద్య సదుపాయం కల్పించాలని, రైల్వేరాయితీ పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే 44 చట్టాలు బదులు తెచ్చిన నాలుగు కోడ్‌లు అమలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలకు నష్టదాయకమైన ప్రైవేటీకరణ విధానాలు కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. సమావేశంలో కోశాధికారి పుత్రేవు సుధాకరరావు, ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు, సహాయ కార్యదర్శి ప్రగడ వాసుదేవరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

వజ్రపుకొత్తూరు: కార్మిక హక్కుల కోసం ఈ నెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు కౌలు రైతుల సంఘం సంపూర్ణం మద్దతిస్తూ అందులో పాలుగుంటున్నమని కౌలు రైతులు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కార్మిక జీవనాడి చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ అనుకూల చట్టాలు తెవడం కోసం నాలుగు కోడ్లుగా మార్చి కార్మికులపై దాడికి ప్రభుత్వం పూనుకుందన్నారు. బిజెపి అధికారం వచ్చిన నాటి నుంచి వేతన సవరణ చేపట్టకుండా కాలయాపన చేస్తుందని పేర్కొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ

పండగలా పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పేరెంట్, టీచర్ సమావేశాన్ని ప్రతి పాఠశాలలో పండుగలా నిర్వహించాలని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ స్పష్టం చేశారు. సోమవారం గార మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న జరుగనున్న పేరెంట్, టీచర్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో అవసరమైన సరుకులను ముందే పంపిణీ చేయాలని, నిరాటంకంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, తగినంత తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు సరిపోయేలా యూనిఫామ్‌లు అందించాలన్నారు. తల్లి పేరుతో ప్రతి విద్యార్థి మొక్కనాటే కార్యక్రమం నిర్వహించాలని, తల్లిదండ్రుల అభిప్రాయాలను రాసి స్కూల్‌కి సమర్పించేలా చేయాలన్నారు. ఈ సమీక్షలో మండల అభివృద్ధి అధికారి, తహశీల్దారు, ఎంపిఒలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

లావేరు: ఈ నెల 10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విజవంతం కావాలని, తల్లిదండ్రులు అందరూ పాల్గొనేలా అధికారులు చూడాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. సోమవారం ఎంఇఒ కార్యాలయంలో అధికారులతో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు పాఠశాల స్థాయిలో సన్నద్ధత కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలల్లో జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనువాసరావు, ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ, ఎస్ఐ జి. లక్ష్మణరావు, ఎపిఎం బి.వి సుబ్బయ్యనాయుడు, ఎపిఒ రెడ్డి సత్యవతి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఈ నెల 10వ తేదీనా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో నిర్వహించనున్న మోగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఆర్.గడ్డెమ్మ అధికారులను సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్, ఎపిఒ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కార్మికుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి అర్‌డబ్ల్యుఎస్ స్కీం సిపిడబ్ల్యుఎస్ తాగునీరు అందించే కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో జీతాలు నిలుపుదల చేశారని అన్నారు. కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు ధర్మారావు, రమేష్, పాడి, రమేష్, పాపారావు, బెహరా, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.

మానవహారం చేపడుతున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల మానవహారం

ఇచ్ఛాపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ రమేష్ పట్నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండ్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. నాలుగైదు రోజుల్లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల పెంపు, కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను సరిదిదిద్దాలన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేకుంటే ఈ నెల 12 అర్ధరాత్రి నుంచి సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు. భవిష్యత్ కార్యాచరణను ప్రకటించిన మహాధర్నా, 5న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద టెంట్లు వేస్తామని, 7న మానవహారం, 8న అర్ధనగ్న ప్రదర్శ నలు, పనిముట్లతో ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. 9న కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల రద్దుకు చేపడుతున్న సమ్మెలో కార్మికులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న రౌండ్ టేబుల్ సమావే శాలు, జూలై 11 మోటర్ బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని నిర్ణయించారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు

టెక్కలి రూరల్ : ఈ నెల 9 దేశవ్యాప్త కార్మిక సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొంటారని జిల్లా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు తెలిపారు. ఈ మేరకు ఐసిడిఎస్ పిఒకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు చెల్లించాలని, ఎనిమిది గంటల పనివిధాణం మాత్రమే ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి. రవణమ్మ, హెచ్.వాణిశ్రీ, బవాణి, లీలమ్మ, సుమిత్ర, ధనం పాల్గొన్నారు.


సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రమాదపుటంచున వంతెనలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో వంశధార వంతెనలు ప్రమాదపటంచిన ఉన్నాయి. వంశధార ప్రధాన కాలువపై ఉన్న వంతెనలు పాకివలస, కన్యవలస, దుప్పలపాడు వంటి అనేక గ్రామాల వద్ద వంతెనలు శిథిలమై ఎప్పుడు కూలిపోతాయే తెలియని పరిస్థితి నెలకొని ఉంది. కన్యవలస వంతెనపై రైలింగ్ పూర్తిస్థాయిలో కూలిపోవడంతో ఇప్పటికీ పలుమార్లు ట్రిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు బోల్తా పడ్డాయి. పాకివలస వద్ద వంతెన పరిస్థితి అదే విధంగా ఉంది. ఇక్కడా రెండుసార్లు ట్రిప్పర్లు కాలువలోకి బోల్తాపడ్డాయి. కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం మండలాలకు కలుపుతూ ఉండే ఈ రోడ్డులో గ్రానైట్ భారీ లారీలు పెద్ద పెద్ద బండలతో ప్రయాణం సాగిస్తుంటాయి. ఏ రోజు కూలిపోతుందో, ఎటువంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితిలో ఈ వంతెనల పైనుంచి ప్రయాణం దినదిన గండంగా మారింది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఈ వంతెనలు నిర్మాణాలకు చొరవచోవడంలేదని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ వంతెనలను పునర్నిర్మాణం చేపట్టాలని సర్వత్రా కరుతున్నారు.

పాకివలస వద్ద పురాతన వంతెన

మాట్లాడుతున్న ఎంపిడిఒ వసంతకుమార్

మహిళలు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి- పలాస

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి ఎంపిడిఒ వసంత కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు మహిళా సాధికారతపై సోమవారం నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పంచాయతీలు పాలన ఎలా చేయాలి, ఎవరితో ఎలా ఉండాలి, అభివృద్ధి ఎలా సాధించాలో మెలకువలు తెలుసుకోవాలన్నారు. ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకొని పాలన చేయాలని సూచించారు. డిఆర్‌పిలు జ్యోతి శ్రీనివాస్, కామరాజు, ఎన్.మన్మథరావులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఎఒ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ పేరాడ ఆనందరావు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుపై దృష్టి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాడి పశువులు పెంచే రైతులు తమకున్న భూమిలో కనీసం పదో వంతు పశుగ్రాసాల సాగుకు కేటాయించాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అభిప్రాయపడ్డారు. మండలంలో గోకర్ణపురంలో నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతు తప్పనిసరిగా పశుగ్రాసాల సాగు వైపు దృష్టి సారించాలన్నారు. తద్వారా దాణా ఖర్చు తగ్గించుకొని లాభసాటిగా పాడి పరిశ్రమ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పశుగ్రాసాల వినియోగం వల్ల 70 శాతం దాణా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. పచ్చిమేత పాడి పశువులకు మేపడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గోప్పిలి ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిని కె.మౌనిక, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ రాస, పశువైద్య సిబ్బంది రాధ, ఢిల్లేశ్వరరావు, వెంకటరావు, ఢిల్లీ, మణమ్మ, పాడి రైతు బొడ్డపాటి జగన్మోహనరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న కరుణాకరరావు

కోటబొమ్మాళి: నాణ్యమైన పశుగ్రాసాలు పండించి శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు మేమినట్లయితే అధిక పాల ఉత్పత్తి పెరుగుతుందని టెక్కలి పశుసంవర్ధకశాఖ ఎడి సిహెచ్.నర్సింహులు, కోటబొమ్మాళి పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాథంలు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రేగులపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో పశువైద్య అధికారి డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్‌తో కలిసి పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కూటికుప్పల ముకుందరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఇఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో ఎన్ఇఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే ఎన్ఇఆర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఎల్లప్పుడూ ప్రజల కోసం అందుబాటులో ఉండే నేతగా అభివృద్ధి కార్యక్రమాలకు అంకితమైన నాయకుడిగా కొనసాగుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. అయన నాయకత్వంలో ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లెంక శ్యామలరావు, డి.జి.ఎం. ఆనందరావు, కలిశెట్టి సూర్యనారాయణ, పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, పిసిని జగన్నాధ నాయుడు, కనకారావు, మారిశెట్టి నాగేశ్వరరావు, రౌతు శ్రీనివాసరావు, నడుపూరు శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు జన్మదిన వేడుకలు మండల కేంద్రం లావేరులో సోమవారం టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ అధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర స్వామి కళ్యాణ మండపంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం వృద్ధులుకు, రోగులకు పళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసిలు ఆర్.ప్రకాశరావు, నిదిగంటల త్రినాథ్, ఎల్.శ్రీనువాసరావు, ఎం.శంకరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న నాయకులు

వ్యక్తి అదృశ్యం

ఎచ్చెర్ల: మండల పరిధిలో అల్లినగరం గ్రామ పంచాయతీ పరిధిలో గల కామర్స్ పేటకు చెందిన కోళ్ల మల్లేశ్వరరావు అనే వ్యక్తి ఈనెల 2 నుంచి కనిపించడం లేదని భార్య పార్వతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఇసుక ట్రైర్ బండికి కూలీగా వెళ్లే తన భర్త రెండవ తేదీన పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడని, తాను ఉపాధి పనికోసం వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి తన భర్త ఇంట్లో సెల్ఫోన్ విడిచి బయటకు వెళ్లాడని తెలిపింది. ఆ రోజు నుంచి నేటి వరకు ఇంటికి చేరలేదని స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన సిఐ రామారావు

పుస్తెలతాడు దొంగల అరెస్టు

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురం, పెద్ద జగన్నాథ పురం వద్ద ఇటీవల జరిగిన పుస్తెలతాడు దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు సిఐ రామారావు విలేకరులకు తెలిపారు. ఉదయం పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీల్లో నిందితులు ద్విచక్ర వాహనంపై పారి పోతుండడంతో ఎస్ఐ పి.రమేష్ బాబు పోలీసులతో చాకచక్యంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన బాలకృష్ణ సాహూ, సంజిత్ కుమార్‌పాడిలు అని అన్నారు. వారి వద్ద నుంచి రెండున్నర తులాల బంగా రం స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు చెప్పారు.

పశువుల అక్రమ రవాణా పట్టివేత

పట్టుబడిన వాహనం

లావేరు: మండలంలోని బుడుమూరు జాతీయ రహ దారిపై పశువుల ను అక్రమంగా రవాణా చేస్తున్న బొలోరో వాహనాన్ని సోమవారం లావేరు ఎస్ఐ లక్ష్మణరావు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అందులో ఉన్న ఏడు ఆవులను గోశాలకు తరలించారు. రణస్థలం మండలం అర్జునవలసకు చెందిన దుప్పాడ అర్జునరావుపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు హెచ్‌సి జోగరావు తెలిపారు.

వాటర్‌ట్యాంక్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వాటర్ ట్యాంక్ స్థల పరిశీలన

లావేరు: మండల కేంద్రం లావేరులో నూతనంగా మంజూరైన వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం అధికారులు, నాయకులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం జెఇ మీసాల మణికంఠ మాట్లాడుతూ లావేరు గ్రామానికి జలజీవన్ మిషన్ నిధులు రూ.1.4 కోట్లు మంజూరైందని తెలిపారు. 90 వేల లీటర్ల సమర్థ్యంతో ట్యాంక్ నిర్మాణం చేయడం జరుగుతుందని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, మాజీ జెడ్‌పిటిసి ఎన్. త్రినాథ్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


కల్వర్టు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ ప్రతినిధి గిరిబాబు

చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు

పొందూరు: మండలంలోని రాపాక చిన్నచెట్టు వీధిలో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు పరిశీలించారు. వీధిలోని కాలువ శిథిలం కావడంతో మురుగునీరు ప్రధాన రహదారిపైనే నిలిచిపోతుంది. అంతేకాకుండా కాలువ శిథిలమవ్వడంతో వీధిలో వాహనాలు రాకపోకలకు వీలు లేకుండా పోయింది, ప్రజలు సైతం వీధిలో నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు నెలకొన్నాయి. దీంతో వీధిలో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈయనతో కార్యదర్శి పి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రతి మండలంలో మోడల్ గ్రూప్‌లు

- శాఖల కన్వర్జెన్స్‌తో కార్యాచరణ ప్రణాళికలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఆదాయ సృష్టి, గ్రామీణ ఉపాధిపై దృష్టిసారించి, పలు శాఖల సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవరాం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్, వ్యవసాయ విస్తరణ, లైవ్‌స్టాక్, గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి, లోన్ రికవరీలు, రీపేమెంట్లు, వడ్డీ సబ్సిడీ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మండలంలో కనీసం ఒక మోడల్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ గ్రూప్‌లు వ్యవసాయ విస్తరణ, లైవ్‌స్టాక్ పథకాలు, గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి వంటి అంశాల్లో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. క్రెడిట్ లింకేజ్‌ను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత ముమ్మరం చేయాలన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. మార్కెటింగ్ లింకేజ్‌ను బలోపేతం చేయాలన్నారు. లోన్ రికవరీ, రీపేమెంట్, వడ్డీ సబ్సిడీలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టి, ఉపాధి అవకాశాలను పెంచేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉపాధి, ఆదాయ వృద్ధికి శాఖల సమన్వయం ద్వారా ముందడుగు వేయడమే అంతిమ లక్ష్యమన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డిఆర్‌డిఎ ఎపిడి పి.కిరణ్ కుమార్, డ్వామా పీడీ పి.సుధాకరరావు, పశుసంవర్ధకశాఖ జెడి కె.రాజగోపాలరావు, వ్యవసాయ శాఖ జెడి కె.త్రినాథ్, సెరీకల్చర్ అధికారి పి.చంద్రజీవన్, ఎల్‌డిఎం పి.శ్రీనివాసరావు, ఎపిఎంఐపి పీడీ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ శ్రీనివాస్

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కోష్ట, రావాడ, రణస్థలం ఎరువుల షాపులను రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి విజయ్ భాస్కర్ విత్తనాలు, ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణం యాజమాన్యం విధిగా ప్రతిరోజూ విత్తనాల నిల్వ, విక్రయ వివరాలు వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఇవ్వాలని సూచించారు. ఎరువులపై కృత్రిమ కొరత ఏర్పాటు చేసి ఎరువులు అధిక ధరలకు అమ్మిన షాపులపై అధికారికంగా తగు చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. షాపు ముందు ఎరువులు, విత్తనాల నిల్వల వివరాలు బోర్డుపై ప్రతిరోజూ పొందుపర్చాలన్నారు. రైతులకు విక్రయించిన ఎరువులకు రసీదు ఇచ్చి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ధ్రువీకరణ చేసుకోని, నిల్వలు భౌతికంగా, ఆన్‌లైన్‌లో ఒకేవిధంగా ఉండాలన్నారు. నిబంధనలకు లోబడి రైతులకు సరైన ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రాయించాలని ఎరువుల దుకాణ యాజమాన్యానికి సూచించారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు మధ్యలో ఉన్న గోపాల చెరువులో ఆక్రమణలు తొలగింపుకు చర్యలు తీసుకుంటామని జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు అన్నారు. జనసేన నాయకులు దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, కీలు సునీల్ వర్మ, అర్జి తులసీరావు, ఢిల్లీరావులతో కలిసి ఆక్రమణకు గురైన చెరువుని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులకు నిర్ధిష్టమైన హద్దులు లేకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని అన్నారు. మండల రెవెన్యూ అధికారులు, సర్వేయరుతో మాట్లాడి సర్వే చేయించి చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి హద్దులు నిర్ణయిస్తామని చెప్పారు.

ఆక్రమణలకు గురైన చెరువును పరిశీలిస్తున్న దుర్గారావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న విప్ అశోక్

నరసన్నపేట : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం : కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ సాధ్యమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని తులసిగాంల పంచాయతీ బలరాంపురంలో సోమవారం నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమమే ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలనను ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి మండల అధ్యక్షులు పద్మనాభం, దక్కత ఢిల్లీరావు దక్కత కామేశ్వరరావు, సహదేవ్‌రెడ్డి, కొండ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నరసన్నపేట : కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేట పట్టణంలో కళాసీ కాలనీ, వీరనాయుడు కాలనీ, లప్పర్స్ కాలనీల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ ఒక సంక్షేమ పథకం తప్పనిసరిగా అమలయ్యే విధంగా పాలన కొనసాగుతుందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని దేశవానిపేట వద్ద 1,50,000 వేల నీటి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆమదాలవలస: మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ముందుగా పాడి రైతులకు పశు దాణాను పంపిణీ చేశారు. అనంతరం అక్కులపేట, శ్రీనివాసాచార్యుల పేట గ్రామాల్లో రూ.కోటి మూడు లక్షలతో నిర్మించిన సిసి రహదారులు, కాలువల అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలన, పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, ఎంపిటిసి సుగుణ, సర్పంచ్ బొడ్డేపల్లి వసుమతి, దూసి నీటి సంఘం అధ్యక్షులు హనుమంతు బాలకృష్ణ, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, ఎంపిడిఓ రోణంకి వెంకటరావు, ఇఒపిఆర్‌డి అన్నెపు గోపాలరావు, పంచాయతీరాజ్ డిఇఇ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని ముక్తాపురంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా సోమవారం ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. ఏడాది పొడవునా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు. ఇంకా ఏం అవసరాలున్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, బొచ్చు ప్రసాదరావు, రవ్వల గణపతిరావు, బూర్ల లలిత కుమారి పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్ ఉంచరాదు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 'మీకోసం'కు 60 అర్జీలు

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అర్జీలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ సైతం ప్రజల నుంచి సమస్యలు విన్నారు. 60 వినతులు మీకోసంకు వచ్చాయి. ఎచ్చెర్ల మండలం జాలారు కొయ్యాంలో 70 ఎకరాలు ప్రభుత్వ భూమి స్థానిక బిజెపి నాయకుడు సాగు చేస్తున్నాడని, అడ్డుకొని స్థానిక మత్స్యకారులకు సాగు హక్కు కల్పించాలని యువకులు కోరారు. గార మండలంలోని వాడాడలో జగన్న కాలనీల్లో ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణం స్థానికంగా కొందరు అడ్డుకుంటున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. భూములు రీ సర్వేలో లోపాలు, సర్వే నంబర్లు జంబ్లింగ్, నిషేధిత జాబితాల్లో భూములు ఉండటం వంటి ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖ, డిసిహెచ్‌ఎస్, ఎపిఇపిడిసియల్, గృహ నిర్మాణశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, దేవదాయ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, తాగునీటి విభాగం తదితర శాఖల సమస్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్ఫ్ ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండల సమైక్య అధ్యక్షులు ఎల్.సుశీలమ్మ అధ్యక్షతన సోమవారం షెడ్యూల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక, జీవనోపాధుల ప్రణాళిక అమలు చేసే దిశగా సంఘ సభ్యులు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలన్నారు. ప్రతి మహిళా పెరటి తోటలో ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు వేసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జనలో లేకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో స్త్రీనిధి ఎజిఎం కె.రాము, సిసిలు పాల్గొన్నారు.

అధికారుల తీరు మారకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

విలేకరులతో మాట్లాడుతున్న గాంధీ

ఆమదాలవలస : జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకు వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు విధినిర్వహణలో తీరు మారకపోతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరుగుతుందని 2024 ఎన్నికల ఆమదాలవలస నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారులు, అధికార పార్టీ నాయకులు ఉపాధి హామీ పథకం అమలులో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 వేల కోట్లు, జిల్లాలో రూ.2,500 కోట్లు, నియోజకవర్గంలో రూ.250 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు కూటమి నాయకులకు పనులను కట్టబెడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశాల మేరకు అధికారులు ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లకు ఇష్టారాజ్యంగా పనులు అప్పగించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ఉపాధిహామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై ఐదు నెలల నుంచి పలుమార్లు జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనలో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ కనీసం జిల్లా కలెక్టర్ స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. అల్లెన, మదనాపురం రహదారి నిర్మాణంలో కెనాల్‌ను కప్పివేసి రహదారి నిర్మించడంతో 900 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందకుండా పోతుందని, వెంటనే కప్పివేసిన కెనాల్‌ను పునరుద్ధరించాలని ఇరిగేషన్ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులకు లేఖ రాసే దుస్థితి ఏర్పడిందన్నారు. బూర్జ మండలం అల్లెనకు రోడ్డువేసే క్రమంలో రైతు అనుమతి లేకుండా భూమిని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని రహదారిని నిర్మించారని, భూసేకరణ లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తగదన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తన శాఖలో జరుగుతున్న నిబంధన ఉల్లంఘనపై దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా అధికారుల తీరు మారకపోతే కోర్టులను ఆశ్రయించడంతో పాటు రోడ్డెక్కి ప్రజా పోరాటాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, గురుగుబెల్లి రాజశేఖర్, బొడ్డేపల్లి గోవిందరావు, ఎండ అప్పలనాయుడు, పైడి విజయ, రమణ, గోపాలకృష్ణ, సింహాచలం, గోపి పాల్గొన్నారు.

ఇనుప కవచం ధ్వంసం

విరిగిన ఇనుప కవచం

కొత్తూరు : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దిమ్మ చుట్టూ ఉన్న ఇనుప కవచం దెబ్బతింది. సోమవారం మండల దళిత మహాసభ గౌరవాధ్యక్షులు జమ్మయ్య, గుమ్మయ్య, అధ్యక్షులు టి.తిరుపతిరావు, సభ్యులు రామకృష్ణ, సూరిబాబు, ప్రశాంత్, రమేష్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీమెన్ల ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న సీమెన్లు

సంతబొమ్మాళి : మండలంలోని మరువాడ పంచాయతీ చొక్కరవానిపేటకు చెందిన తాపీమేస్త్రీ మూగు రాజు కుటుంబానికి సీమెన్స్ సోమవారం ఆర్థికసాయం అందించారు. రాజు పని చేస్తూ కాలుజారి కింద పడటంతో వెన్నెముకకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన వైద్య ఖర్చులకు గ్రామానికి చెందిన సిమెన్స్ అందరూ కలిసి ఆ కుటుంబానికి చేయుతగా రూ.పది వేలు అందజేశారు. కార్యక్రమంలో సిమెన్లు సూరాడ రాయుడు, సూరాడ గురునాథం, చొక్కర ప్రసాద్, అర్జాల రాజు, చొక్కర లక్ష్మణరావు, సూరాడ లక్ష్మణ, సూరాడ ఎర్రనాయుడు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

గరుడభద్రలో పారిశుధ్య పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గరుడుభద్రలో సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు ఆధ్వర్యాన సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. మంగళవారం నిర్వహించనున్న విత్తన వారాలు దృష్ట్యా ప్రొక్లెయినర్ సాయంతో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగింపు, చింతబంధ చెరువుకు వెళ్లి బట్టి శుభ్రం, సింహద్వారం ఎదురుగా గ్రావెల్ సర్ది లెవెల్ చేయుట,కూలీల సహాయంతో ఊరు మొత్తం వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. రానున్న వర్షా కాలం దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ సమీపంలో పాత జాతీయ రహదారిపై ఈనెల 1న జరిగిన ప్రమాదంలో మండల పరిధిలో లింగాలపేట గ్రామానికి చెందిన వంశీ శ్రీనివాస్ (42) ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. స్థానికులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అన్నదాత సుఖీభవ'కు గ్రీవెన్స్

మాట్లాడుతున్న ఎడి రామారావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులు తమ గ్రీవెన్స్‌ను గ్రామ వ్యవసాయ సహాయకులకు దరఖాస్తు చేసుకోవాలని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ రైతులు గ్రీవెన్స్‌ను ఈ నెల 10 లోపల నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. బ్యాంకులో లోను తీసుకొని రైతులు పంట ఇన్స్యూరెన్స్ నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని సూచించారు. వరి పంట ఎకరాకు రూ.160 ప్రీమియం చెల్లించుకోవాలని తెలియజేశారు. పంట నష్టపోతే రూ.40 వేలు వరకు బీమా పొందవచ్చని తెలియజేశారు. వ పంటకు ఆఖరు తేదీ ఆగస్టు 31 వరకు ఉందన్నారు. మొక్కజొన్నకు రూ.66 ఎకరానికి ప్రీమియం చెల్లించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.దానకర్ణుడు, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రభావతి, సుమంత్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

కవిటి: కవిటిలో దాతల సహాయంతో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధికి దాతలు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా కవిటికి చెందిన టౌన్ మార్కెట్ అధినేత పిరియా రవిప్రసాద్, ప్రశాంతి దంపతులు రూ.50 వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఒక ట్రాక్టర్ చిప్స్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో దాతల సహకారంతో ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పడుతోందని అన్నారు. అందరి సహకారంతో తొందర్లోనే ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా కృష్ణదాస్ జన్మదినం

నరసన్నపేట : వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు నరసన్నపేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి కార్యాలయం ప్రాంగణం జనంతో సందడిగా మారింది. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.